

అక్కడంతా రహస్యమే..!



- వరుస ప్రమాదాలు జరుగుతున్నా స్పందించని అధికారులు
- ప్రమాదం జరిగితే పక్క రాష్ట్రంలో వైద్యం
- వలస కార్మికులకు రక్షణ కరువు
- కనీస సౌకర్యాలకు నోచని కార్మికులు
- బాధితులకు అందని పరిహారం

కనీస సౌకర్యాలు లేని వలస కార్మికుల నివాసాలు

హిందూపురం రూరల్ మండలం తూమకుంట, గోళాపురం పారిశ్రామిక వాడ ఒక రహస్య మాయాలోకం. అక్కడంతా రహస్యమే..! ఉన్నచోట ఉపాధి లేక పొట్టకూటి కోసం వచ్చిన వలస కార్మికులు వరసగా ప్రమాదాలకు గురవుతున్నప్పటికీ అటు పరిశ్రమల శాఖలో కానీ, ఇటు కార్మిక శాఖలో గాని కనీస స్పందన కనిపించడం లేదు. ఈ పారిశ్రామిక వాడలో ఉన్న స్టీల్, రసాయన పరిశ్రమల్లో నిత్యం ఏదో ఒక పరిశ్రమలో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రమాదాల్లో గాయపడిన వారిని స్టీల్ పరిశ్రమల నిర్వాహకులు ఇక్కడ వైద్యం అందిస్తే ప్రమాదాలు జరిగిన విషయం బయటకు వస్తుందని పక్కనే ఉన్న కర్నాటక రాష్ట్రానికి తరలించి వైద్యం అందిస్తున్నారు.

ప్రజాశక్తి-హిందూపురం

వారం క్రితం గోళాపురం పారిశ్రామిక వాడలోని బ్లూ గోల్డ్ స్టీల్స్ పరిశ్రమలో సమయంలో రోలింగ్ మిల్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న వలస కార్మికుడు అనూప్ ప్రమాదానికి గురికావటంతో కుడి కాలు విరిగిపోయింది. ఈ విషయంపై పరిశ్రమ మేనేజర్ ను సంప్రదిస్తే తనకు ఏమీ తెలియదని చెప్పడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ప్రమాదానికి గురైన కార్మికుడు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం గుండా జిల్లాకు చెందిన కార్మికుడిగా తెలిసింది. కార్మిక శాఖ నిబంధనల మేరకు ప్రమాదం జరిగిన వెంటనే హిందూపురం పట్టణంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేసుకుని వెళ్లాల్సి ఉంది. అయితే ఇలాంటి నిబంధనలను స్టీల్ పరిశ్రమల నిర్వాహకులు ఏమాత్రం పాటించడం లేదు. ప్రమాదం జరిగిన వెంటనే పక్క రాష్ట్రమైన కర్నాటకకు తీసుకుపోవడం అక్కడ వైద్య సేవలు అందించడం నిత్యకృత్యమైంది. ఒకవేళ ఆ కార్మికుడు మృతి చెందితే కాస్తో కూస్తో ఆ కుటుంబానికి నష్టపరిహారం అందించి చేతులు దులుపుకోవడం ఇక్కడ పరిపాటిగా మారింది. ఇదే విధంగా 20 రోజుల క్రితం మీనాక్షి స్టీల్ పరిశ్రమ నిర్వాహకులు భద్రతా ప్రమాణాలు పాటించక పోవడంతో రోలింగ్ మిల్ విభాగంలో పనిచేస్తున్న బీహార్ రాష్ట్రం జమాయి జిల్లా కర్మ గ్రామానికి చెందిన వలస కార్మికుడు జూబ్లాల్ టిఎంటికి ఇనుప రాడ్డు కడుపులోకి చొచ్చుకుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. వీరి కుటుంబానికి కాస్త కూస్తో నష్ట పరిహారం అందించి చేతులు దులుపుకున్నారు. ఈ విషయాన్ని ప్రజాశక్తి వెలుగులోకి తీసుకురావడంతో ఆ కార్మిక కుటుంబానికి తూమకుంట పారిశ్రామిక వాడ కార్మిక సంఘం నాయకులు స్పందించి న్యాయపరంగా నష్టపరిహారం అందించే విధంగా పరిశ్రమ యాజమాన్యంతో ఒత్తిడి తెస్తున్నారు. ఈ విషయాలన్నీ ఆయా పరిశ్రమల నిర్వాహకులు బయటకు పక్కకు రాకుండా గోప్యంగా ఉంచుతున్నారు. అందుకోసమే స్టీల్ పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన వారిని తీసుకుంటున్నారు. వలస కార్మికులను నేరుగా పరిశ్రమ నిర్వాహకులు తీసుకోకుండా కాంట్రాక్టర్ ద్వారా ఉద్యోగంలో నియమించుకుని వలస కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలోని హిందూపురం రూరల్ మండలంలో ఉన్న తూమకుంట, గోళాపురం పారిశ్రామిక వాడలకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆ గుర్తింపును ఇక్కడ ఉన్న స్టీల్ రసాయన పరిశ్రమల నిర్వాహకుల వల్ల కనుమరుగు అవుతోంది. ఇక్కడ దాదాపు 150 కి పైగా వివిధ పరిశ్రమలు ఉన్నాయి. ఇందులో స్టీల్, రసాయన పరిశ్రమల్లో ఎక్కువ శాతం కార్మికులు ఒరిస్సా, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, జార్ఖండ్, ఢిల్లీ తదితర రాష్ట్రాలకు చెందిన వందలాదిమంది వలస కార్మికులు పొట్టకూటి కోసం వారి ప్రాణాలను ఫణంగా పెట్టి బానిసలకన్నా హీనంగా కార్మికులు పనిచేస్తున్నారు. చట్టం ప్రకారం వలస కార్మిక చట్టాన్ని అమలు చేసి కార్మికుల వివరాలన్నింటిని కార్మిక శాఖకు ఇవ్వడంతో పాటు కార్మికులందరికీ సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ఆయా పరిశ్రమలపై ఉంది. చట్టాన్ని చుట్టంగా మార్చుకున్న స్టీల్ పరిశ్రమల నిర్వాహకులు పరిశ్రమల శాఖ, కార్మిక శాఖ అధికారులకు ముడుపులు ఇచ్చుకుంటూ వారి పరిశ్రమల నుంచి మూడు పువ్వులు ఆరు కాయలుగా లాభాలను ఆర్జిస్తున్నారు. అందుకోసమే ప్రధానంగా ఉన్న ఈ రెండు శాఖలు ఎప్పుడైనా వారికి ముడుపులు అవసరమైనప్పుడు పరిశ్రమలను తనిఖీ పేరుతో వచ్చి ముడుపులు తీసుకుని వెళ్ళిపోతున్నారే తప్ప ఏ ఒక్క పరిశ్రమ పైన ఇప్పటి వరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్న ఆరోపణలు వినపడుతున్నాయి. ప్రమాదాలు సంభవించి ఎంతోమంది అవిటి వాళ్లు కావడంతో పాటు ఎన్నో కుటుంబాలు ఉన్న పెద్ద దిక్కును కోల్పోయి ఆ కుటుంబాలు రోడ్డున పడుతున్నప్పటికీ అధికారుల్లో చలనం మాత్రం కనిపించడం లేదు. ఇప్పటికైనా మూడుపుల మత్తులో తులతూగుతున్న పరిశ్రమల శాఖ, కార్మిక శాఖ అధికారులు స్పందించి వలస కార్మిక చట్టాన్ని పక్కాగా అమలు చేయడంతో పాటు పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దీంతోపాటు వివిధ ప్రమాదాల్లో గాయపడిన కార్మికుల కుటుంబాలకు కార్మిక చట్టాన్ని అనుసరించి నష్టపరిహారాన్ని అందించే విధంగా చర్యలు తీసుకొని ఆ కుటుంబాలను ఆదుకోవాల్సిన అవసరం ఉంది.



ప్రమాదంలో కాలుపోగొట్టుకుని హిందూపురంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వలస కార్మికుడు అనూఫ్



ఇటీవల ప్రమాదం జరిగిన పరిశ్రమ

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదు



తూమకుంట, గోళాపురం పారిశ్రామిక వాడలో ఉన్న స్టీల్ పరిశ్రమల్లో తరచుగా ప్రమాదాలు సంభ విస్తున్నప్పటికీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ప్రమాదాలు సంభవించిన సమయంలో అన్ని ఆధారాలతో ఫిర్యాదు చేస్తున్నప్పటికీ సకాలంలో పరిశ్రమలను తనిఖీ చేసి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు వలస కార్మిక చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి.

రవికుమార్,
తూముకుంట పారిశ్రామిక వాడ కార్మిక సంఘం అధ్యక్షులు

ఏసీబీ దాడులతో అధికారుల్లో కలవరం

కళ్యాణదుర్గం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో కొనసాగిన తనిఖీలు

ప్రజాశక్తి - కళ్యాణదుర్గం టౌన్

కళ్యాణదుర్గం ఇన్‌ఛార్జి సబ్ రిజిస్టర్ నారాయణస్వామిని ఎసిబి అధికారులు వలపన్ని పట్టుకోవటంతో అవినీతి అధికారుల్లో కలవరం మొదలైంది. గురువారం రాత్రి అనంతపురంలో కళ్యాణదుర్గం ఇన్‌ఛార్జి సబ్ రిజిస్టర్ లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ జెస్సి ప్రశాంతి బృందం పట్టుకున్న సంగతి తెలిసిందే. ఈ సంఘటనపై శుక్రవారం కళ్యాణదుర్గం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో డీఎస్పీ బృందం తనిఖీలు నిర్వహించింది. ఏసీబీని ఆశ్రయించిన నాగేంద్ర నాయక్ వాంగ్మూలం మేరకు ఎసిబి అధికారులు విచారణ మొదలుపెట్టారు .కళ్యాణదుర్గం రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్ 252-2 సి లోని 1-50 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ విషయంలో ఇన్‌ఛారి సబ్ రిజిస్టర్ బాధితులను వేధించడంతో వారు ఏసీబీని ఆశ్రయించారు . వ్యవసాయతర భూమిగా రిజిస్టర్ చేస్తే ప్రభుత్వ విలువ ప్రకారం కోట్ల ఐదు రూపాయలు ఉందని, అందుకు ప్రభుత్వం నిబంధన ప్రకారం రూ.7.5 లక్షల రుసుము చెల్లించాలని మొదట్లో సబ్ రిజిస్టర్ సూచించారు .ఈ లెక్కన సదరు భూమికి సుమారు 30 లక్షల దాకా చలానా తీయాల్సి వస్తుంది. దీనిని భారంగా భావించిన నాగేంద్ర నాయక్ వ్యవసాయ భూమి గా రిజిస్టర్ చేయాలని పలుమార్లు కోరారు. దీంతో సబ్ రిజిస్టర్ లంచం ఇవ్వాలని బేరానికి దిగాడు. దీంతో నాగేందర్ నాయక్ ఏసీబీని ఆశ్రయించాడు. రూ. 5 లక్షలు ఇవ్వటానికి సబ్‌రిజిస్టర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు ఇందులో భాగంగానే ఈనెల 17న సదరు భూమి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నారు .ఒప్పందం ప్రకారం లంచంగా ఇవ్వాల్సిన రూ. 5 లక్షల కోసం సబ్ రిజిస్టర్ నాగేందర్‌ను ఒత్తిడి చేశాడు. వాట్సఅప్ కాల్ ద్వారా పలుమార్లు ఒత్తిడి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు వారి సూచనల మేరకు అనంతపురం పట్టణంలోని కాకతీయ అపార్ట్మెంట్ సమీపంలోకి రావాలని సబ్ రిజిస్టర్‌కు సూచించారు. రామ్ నగర్ లో ఉన్న సబ్ రిజిస్టర్‌కార్యాలయం సమీపంలో డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ జెస్సి ప్రశాంతి బృందం సబ్‌రిజిస్టర్‌ను రెడ్‌హ్యాండిల్‌గా పట్టుకుంది. దీని ఆధారంగా సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సంబంధించిన రిజిస్టర్ డాక్యుమెంట్లను శుక్రవారం పరిశీలించారు. అంతేకాకుండా ఇన్‌ఛార్జి సబ్ రిజిస్టర్ గా బాధ్యతలు చేపట్టిన నారాయణస్వామి అప్పటి నుంచి నేటి వరకు ఏయే సర్వే నంబర్లలో ఎవరి పేరుతో ఎంతవిలువ చలానా సమర్పించి రిజిస్టర్లు చేశారు, ఇది కాకుండా ఫిర్యాదుల అందిన మేరకు ఇతర ప్రాంతాల్లో భూములను కూడా అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసి అవినీతికి పాల్పడిన విషయాలను కూడా నిగ్గు తేల్చేపనిలో ఏసీబీ బృందం నిమగ్నమైనట్లు తెలుస్తోంది. ఏసీబీ అధికారులు కళ్యాణదుర్గం సబ్ రిజిస్టర్ కార్యాలయం అవినీతిపై పూర్తిస్థాయిలో విచారణ చేపడితే మరిన్ని అవినీతి అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశాలున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా కళ్యాణదుర్గం సబ్ రిజిస్టర్ ఏసీబీకి పట్టు పడడంతో ఈ ప్రాంతంలోని అధికారులు వ్యాపార వర్గాలు కలవరం మొదలైంది.



కళ్యాణదుర్గం సబ్‌రిజిస్టర్ కార్యాలయంలో అధికారుల తనిఖీలు

ప్లాస్టిక్ విక్రయ దుకాణాలపై దాడులు

రూ.1,66,500ల జరిమానా

ప్రజాశక్తి - అనంతపురం కార్పొరేషన్

నగరంలోని ప్లాస్టిక్ విక్రయ హోల్‌సేల్ దుకాణాలపై అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఏకకాలంలో 12 టీములు మెరుపు దాడులు నిర్వహించి పెద్ద మొత్తంలో ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా వారి నుంచి రూ.1,66,500 జరిమానా విధించి ఆ మొత్తాన్ని వసూలు చేశారు. మే 29 తేదీన ఒకే సమయంలో ఒకేసారి ప్లాస్టిక్ విక్రయ దుకాణాలపై దాడులు నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన దాడుల్లో గంట వ్యవధిలో సుమారు ఒక టన్ను వరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను సీజ్ చేశారు. 12 షాపుల నుంచి 1,66,500 రూపాయల రుసుము వసూలు చేశారు. తిలక్ రోడ్డు, రాజు రోడ్‌లోని హోల్ సేల్ షాపుల్లో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బాలస్వామి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దాడులు నిర్వహించామన్నారు. పట్టణంలోని కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయన్నారు. ప్రధానంగా ప్రజారోగ్యం దృష్ట్యా ఈ దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడులు ఇకపైన కూడా కొనసాగుతాయని చెప్పారు. రెండోసారి పట్టుబడినట్లయితే 40 వేల రూపాయలు జరిమానాతో పాటు షాపును సీజ్ చేసి నిందితులను కోర్టుకు హాజరుపర్చుతామన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన బడిబస్సు

ప్రజాశక్తి - ఉరవకొండ

ఉరవకొండలోని ఉషోదయ ప్రయివేటు పాఠశాలకు(మమత ఎడ్యుకేషన్ సొసైటీకి) చెందిన బస్సు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామం నుంచి 20 మంది విద్యార్థులతో ఉరవకొండకి వస్తుండగా పాల్తూరు గ్రామ సమీపంలో ఎదురుగా టిప్పర్ అడ్డు రావడంతో తప్పించబోయిన డ్రైవర్ బస్సును పొలాల్లోకి వెళ్లనిచ్చాడు. అయితే ఈసంఘటనలో విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరకపోవటంతో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.



పొలంలోకి దూసుకెళ్లిన బడిబస్సు

పెన్షన్ రీవాలిడేషన్ రద్దు చేయాలి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫైనాన్స్ బిల్ 2025లోని పెన్షన్ రీవాలిడేషన్‌ను రద్దు చేయాలని పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శుక్రవారం నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఫర్ పెన్షనర్స్ అసోసియేషన్ పిలుపుమేరకు అనంతపురం నగరం ఆర్ట్స్ కాలేజీ ఆవరణంలో పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. క్లాక్ టవర్ వరకు ర్యాలీగా వచ్చి అక్కడ మానవహారంగా నిలబడి నిరసన తెలిపారు. బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ సంక్షేమ సంఘం జాతీయ నాయకులు రాజశేఖరరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన నిరసనలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్‌ల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.పెద్దన్నగౌడ్, శీలా జయరామప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఫైనాన్స్ బిల్ 2025 లోని పెన్షన్ రీవాలిడేషన్ రద్దు చేయాలన్నారు. 8వ వేతన సంఘాన్ని వెంటనే నియమించాలన్నారు. పెన్షన్ కమ్యూటేషన్ రికవరీ 15 నుంచి 12 సంవత్సరాలకే కుదించాలన్నారు. ఈ కార్యక్రమంలో టెలికాం సంఘం జిల్లా సెక్రెటరీ కె.పద్మనాభ చారి, అసిస్టెంట్ సర్కిల్స్ సెక్రటరీ ఎం.శుభాన్, బ్రాంచ్ సెక్రటరీ పి.బాలరంగయ్య, పోస్టల్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వన్నప్ప, ఆర్.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రైతాంగాన్ని ఆదుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ. నల్లప్ప

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో వర్షాభావ పరిస్థితుల్లో రైతులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలుగా ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 3,40000 హెక్టార్లకు గాను కేవలం 70 వేల హెక్టార్లలో 19 శాతం పంటలు సాగయినట్లు అధికారులు చెబుతున్నారని తెలిపారు. ఈ ఏడాది జూన్‌లో సాధారణంగా 61 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉంటే 47 మిల్లీమీటర్లు, జులైలో 63 మిల్లీమీటర్లకు గాను 34 మిల్లీమీటర్లు మాత్రమే వర్షపాతం నమోదయిందన్నారు. సాధారణ వర్షపాతం కూడా నమోదు కాకపోవడంతో సాగుచేసిన పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. యాడికి, పెద్దవడుగూరు మండలాల్లో వేసిన పత్తి పంట వర్షాభావంతో ఎదుగుదల లేకపోవటంతో ట్రాక్టర్లతో దున్నివేశారన్నారు. ఎకరాకు రూ.30 వేల దాకా పెట్టుబడి పెట్టి నష్టపోయి అప్పుల పాలయ్యారన్నారు. వర్షం వస్తే ప్రత్యామ్నాయ పంటలు పెట్టుకోవడానికి అదనంగా పెట్టుబడి పెట్టాల్సి వస్తుందని ఈ భయానక పరిస్థితుల్లో అప్పుల భారంతో రైతాంగం ఉందని అన్నారు. ప్రస్తుతం రైతుల పరిస్థితిపై ప్రభుత్వంలో కనీస చలనం లేకపోవటం శోచనీయమన్నారు. రైతుకు భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం గత సంవత్సరంలో నష్టపోయిన పంట నష్టపరిహారం పంటల బీమా ఇవ్వలేదన్నారు. ఎన్నికల హామీ అన్నదాత సుఖీభవ కూడా ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ప్రత్యామ్నాయ పంటల కోసం ఉచితంగా విత్తనాలివ్వాలని జిల్లా రైతాంగానికి ఆదుకోవడానికి ప్రభుత్వం వెంటనే వ్యవసాయ ప్రణాళిక ప్రకటించాలని డిమాండ్ చేశారు. 2022 సంవత్సరం నుంచి ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు పరిహారం ఒక్క పైసా కూడా ఇంతవరకు ఇవ్వలేదని వెంటనే ఇచ్చి ఆ కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య, ఎస్.నాగేంద్ర కుమార్, ఆర్.చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతర్‌రాష్ట్ర గుప్తనిధుల తవ్వకాల ముఠా అరెస్ట్

ప్రజాశక్తి - గుంతకల్లు రూరల్

అంతర్‌రాష్ట్ర గుప్తనిధుల తవ్వకాల ముఠాను అరెస్టు చేసినట్లు సిఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ ముఠాకు సంబంధించిన వివరాలను శుక్రవారం స్థానిక రూరల్ పోలీస్స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మండల పరిధిలోని నాగసముద్రం సమీప కొండల్లో త్రవ్వకాలు చేపట్టిన 9 మందిని అరెస్టు చేసి వారి నుండి మెటల్ డిటెక్టర్, ఇన్నోవా కారు, అప్పి ఆటో సీజ్ చేశామన్నారు. నిందితులను కోర్టుకు హాజరుపర్చామన్నారు. ఈ సమావేశంలో ట్రయినీ డీఎస్పీ అస్రఫ్ అలీ, ఎస్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సిఐ

జనసంచారంలోకి 'అలుగు'

భయాందోళనకు గురైన ప్రజలు

ప్రజాశక్తి-గుమ్మగట్ట

మండల పరిధిలోని తాళ్లకెర గ్రామంలోకి సమీపంలోని కొండగుట్ట నుంచి ఓ అలుగు (ఆల్వ) గురువారం రాత్రి గ్రామంలోకి ప్రవేశించింది. దీంతో స్థానికులు భయాందోళన చెందారు. అలుగును గమనించిన స్థానికులు వెంటనే వీఆర్వోకు సమాచారం అందించారు. ఆయన ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ దామోదర్‌రెడ్డికి చెప్పడింతో సిబ్బందితో గ్రామానికి చేరుకుని అలుగును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలోకి వచ్చిన అలుగును సురక్షితమైన అలవీ ప్రాంతంలో వదలనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామాంజనేయులు, వీఆర్ఏలు బద్రీ, బాలకృష్ణ, రమేష్, ప్రజలు పాల్గొన్నారు.



అలుగును అధికారులకు అందజేస్తున్న గ్రామస్తులు

'పి-4' విజయవంతం అందరి బాధ్యత

అనంతపురం కార్పొరేషన్ : పేద కుటుంబాలను ఉన్నత స్థానానికి తీసుకురావడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. శుక్రవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి పీ.4 కార్యక్రమంపై కలెక్టర్లు, ఎమ్మెల్యేలతో నిర్వహించిన జూమ్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పీ-4 లోగోను ఆవిష్కరించి ఎమ్మెల్యేలకు అధికారులకు కీలక సూచనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పి.4 కార్యక్రమాన్ని విజయవంతం చేయడం మనందరి బాధ్యత అన్నారు. ఇందులో భాగంగా అనంతపురంలో చదువుకుని ఎంతోమంది దేశ, విదేశాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారన్నారు. అలాంటివారిని ఇందులో మార్గదర్శిగా ఉండేలాగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బాలస్వామి, అడిషనల్ కమిషనర్ పావని, తహశీల్దార్ హరికుమార్, ఎంపిడిఒ దివాకర్, ఎస్ఒ చంద్రశేఖర్, పీ-4 సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయ శాఖలో అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలి

జిల్లా కోర్టు ఎదుట న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

న్యాయ శాఖలో అపరిష్కృతంగా వున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం భారత న్యాయవాదుల సంఘం(ఐఏఎల్) ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా కోర్టు గేటు ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేసన్ రాష్ట్ర నాయకులు ఐదుకల్లు రవీంద్రనాథ్, జిల్లా అధ్యక్షులు అబ్దుల్ రసూల్, జాతీయ కార్యవర్గ సభ్యులు జె.రాజారెడ్డి మాట్లాడుతూ న్యాయవాదుల పరిరక్షణ చట్టం లేకపోవడం వల్ల కేసుల్లో శిక్షలు, వ్యతిరేక తీర్పులు వచ్చినప్పుడు న్యాయవాదులపై దాడులు చేయడం, హత్యలు చేయడానికి కూడా వెనుకడకపోవడం భయందోళనలను కలిగిస్తోందన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే న్యాయవాదుల పరిరక్షణ చట్టం చేయాలన్నారు. ఖాళీగా ఉన్న న్యాయమూర్తులు, పిపిల పోస్టులు భర్తీ చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్త కోర్టు భవనాలు నిర్మించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కోర్టు ప్రాంగణంలో మహిళా విశ్రాంతి హాల్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. . ఎపి. ప్రభుత్వం ఇవ్వాల్సిన మ్యాచింగ్ గ్రాంట్ రూ.4 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలన్నారు. న్యాయవాదుల వెల్ఫేర్ ఫండ్ రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలన్నారు. న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.జూనియర్ న్యాయవాదులకు ఇవ్వాల్సిన స్టయిఫండ్ రూ.10 వేలకు పెంచి వెంటనే విడుదల చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులకు పర్మినెంట్ హెల్త్ కార్డులు మంజూరు చేయాలన్నారు. చనిపోయిన న్యాయవాది కుటుంబాలకు ఇవ్వవలసిన పెండింగ్ మ్యాచింగ్ గ్రాంట్ బకాయిలను న్యాయవాద కుటుంబాలకు ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఎల్ నగర అధ్యక్షులు యం.నారాయణ స్వామి, ఉపాధ్యక్షులు ఆర్ఎల్ఎన్.వరప్రసాద్, సీనియర్ న్యాయవాదులు ఎర్రిస్వామి, చంద్రశేఖర్, ప్రకాష్ రెడ్డి, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీ భాస్కర్, కల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

సినిమా టికెట్ ధరలు తగ్గించాలి : డివైఎఫ్ఐ



వినతిపత్రం అందజేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన హరిహర వీరమల్లు సినిమా టికెట్ల ధరలు తగ్గించాలని డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు డిప్యూటీ తహశీల్దార్ నారాయణస్వామిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ పట్టణ ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు మాట్లాడుతూ టికెట్ల ధరలు పెంచుకోవడానికి జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేసి ధరలు తగ్గించాలన్నారు. పవన్‌కళ్యాణ్ డిప్యూటీ సీఎం హోదాలో ఉంటూ సామాన్యులకు వినోదం దూరం చేసే విధంగా తను నటించిన సినిమా టికెట్ ధరలు పెంచుకోవడానికి ప్రభుత్వంతో జీవో జారీ చేయించడం సిగ్గు చేటన్నారు. సామాన్యులు నిత్యావసర సరుకులు అధిక ధరలతో కొనలేకపోతుంటే వినోదాన్ని కూడా అందని ద్రాక్షగా చేయడం చాలా దారుణమన్నారు. సినిమా థియేటర్లలో సరైన మౌలిక సదుపాయాలు లేవని అలాంటి వాటిపై చట్టపరైన చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా థియేటర్ ఆవరణలో పార్కింగ్ ఫీజు వసూలు చేయకూడదని నిబంధన ఉన్నా కూడా నిబంధనలను ఉల్లంఘిస్తూ పార్కింగ్ వసూలు చేస్తున్నారన్నారు. థియేటర్లలో అమ్ముతున్న తినుబండారాలను అధిక ధరలకు విక్రయిస్తూ అన్నివిధాలా సామాన్యుల జేబులకు చిల్లులు పడే విధంగా చేస్తున్న ఈ థియేటర్ యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు కిషోర్, జయరాం, మహి, నవి, లోకేష్, శివరామ్, తదితరులు పాల్గొన్నారు.


కసాపురంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

శ్రావణమాసాన్ని పురస్కరించుకుని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం కసాపురం ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించాలని ఆర్‌డిఒ శ్రీనివాస్ సంబంధిత ఉద్యోగులకు సూచించారు. శుక్రవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రావణమాసంలో ప్రతి శుక్ర, శని మంగళవారాల్లో వేల మంది భక్తులు కసాపురం ఆలయానికి వస్తారన్నారు. కావున భక్తులకు సకల సౌకర్యాలు కల్పించేందుకు అన్నిశాఖ ఉద్యోగులు సమన్వయం చేసుకుంటూ పని చేయాలన్నారు. ఇందుకు పంచాయతీరాజ్, విద్యుత్ శాఖ, మున్సిపాలిటీ శాఖ పోలీస్ శాఖ కీలక బాధ్యత నిర్వహించాలని సూచించారు. ఫైర్ డిపార్ట్మెంట్, హెల్త్ ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆలయ ఉద్యోగులు భక్తులపై నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా గౌరవంగా ప్రవర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప కమిషనర్ వాణి, ఆలయ అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ, డీఎస్పీ శ్రీనివాసులు, ట్రైనీ డీఎస్పీ ఆష్రఫ్, రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐలు వెంకటస్వామి, రాఘవేంద్రప్ప, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అబద్ధపు హామీలకు కేరాఫ్ చంద్రబాబు

మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి



నియామక పత్రాలు అందజేస్తున్న విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

అబద్ధపు హామీలకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు అని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. శుక్రవారం ఉరవకొండ, విడపనకల్ మండలాల వైసిపి నాయకులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా 'బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి నాయకులు అనేక హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత మోసం చేశారన్నారు. రైతు భరోసా, ఆడబిడ్డ నిధి, మహిళలకు ఉచిత బస్సు, బీమా, ఇన్‌పెట్ సబ్సిడీ, అన్నదాత సుఖీభవ లాంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేయకుండా కల్లబొల్లి కబుర్లతో కాలయాపన చేస్తున్న చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ అనుబంధ సంఘాల కమిటీ అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులకు నియామకపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, మండల కన్వీనర్ రమేష్, ఉపాధ్యక్షులు నాగేంద్ర, నాయకులు సిపి వీరన్న, భరత్‌రెడ్డి, కరణం భీంరెడ్డి, గాజుల వెంకటేశులు, సుంకన్న, ఉమాశంకర్, ఓబులేసు, రఘురాములు, మడకశిర యల్లప్ప, పాల్తూరు నాగరాజు, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకులను పూర్తిస్థాయిలో నింపాలి

ప్రజాశక్తి-గుంతకల్లు

ప్రజలకు తాగునీరు సరఫరా చేసే రెండు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులనూ హంద్రీనీవా నీటితో పూర్తిస్థాయిలో నింపాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్.భవాని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈమేరకు శుక్రవారం హంద్రీనీవా కాలువలో ప్రవహిస్తున్న నీటిలో పసుపు, చీర సమర్పించి గంగపూజ చేశారు. అనంతరం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పంపింగ్‌కు స్విచ్ ఆన్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు తాగునీరు సరఫరా చేసే సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్లో పూర్తిగా నీరు నింపాలన్నారు. ఇందుకోసం ఇంజనీర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నయీమ్‌అహ్మద్, పట్టణ టిడిపి ఇన్‌ఛార్జి నారాయణస్వామి, మున్సిపల్ ఇంజినీర్ ఇంతియాజ్, డిఇ షబానా, ఎఇలు ప్రతాప్, సుదర్శన్, కౌన్సిలర్లు, ఇంజినీరింగ్ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్'పై మోసం

పుట్లూరు : ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా మోసం చేస్తున్నారని వైసిపి మండల కన్వీనర్ పొన్నపాటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. వైసిపి సమన్వయకర్త సాకే శైలజనాథ్ శుక్రవారం మండలంలోని చాలివేముల, నారాయణరెడ్డిపల్లి, మడ్డిపల్లి గ్రామాలో 'బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మేనిఫెస్టోను వివరిస్తూ చేస్తున్న మోసాలను క్యూఆర్ కోడ్ సాయంతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వెన్నం శివారెడ్డి, నాయకుల రమణయాదవ్, నరసింహారెడ్డి, నాగలక్ష్మమ్మ, మడుగుపల్లి సీనియర్ నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, సాయినాథ్‌రెడ్డి, మడ్డిపల్లి ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కేశవరెడ్డి, చరణ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని కోనాపురం, పడమటి కోడిపల్లి గొల్లలదొడ్డి గ్రామాల్లోని పాఠశాలల్లో పని చేస్తూ బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌నాయుడు, సాయిరాం ఉపాధ్యాయురాలు లక్ష్మి, సాయిదాను సర్పంచు, స్కూల్ కమిటీ ఛైర్మన్ ఆధ్వర్యంలో శుక్రవారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు వనితా మల్లికార్జున, సింగిల్‌విండో ప్రెసిడెంట్ ఓబులేసు, ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున, నారాయణస్వామి, గోవింద్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, మహేష్, ప్రవీణ్, రాధిక, తిరుపాల్, హైస్కూల్ కమిటీ ఛైర్మన్ శేఖర్, నగేష్, నాయకులు విరూపాక్షి, శాంతి, మంజు, శీనప్ప, కరేగౌడ, నరసింహులు, చన్నమల్ల ప్రకాష్, అంగన్వాడీ మంజుల పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

యాడికి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెలకొన్న తాగునీటి సమస్యను టిడిపి మండల కన్వీనర్ రుద్రమనాయుడు తీర్చారు. ఈమేరకు శుక్రవారం పాఠశాలలో మినరల్ వాటర్ ఏర్పాటుకు పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఉచితంగా మంచినీరు ఇవ్వాలని వాటర్‌ప్లాంట్ యజమానులతో చర్చించి తక్కువ రుసుంతో నీటిని అందిచేందుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సీతారామాంజనేయులు, ఎపిటిఎఫ్ శ్రీనివాస్‌యాదవ్, టిడిపి నాయకులు తాంద్ర విక్రమ్, కోడూరు నీలకంఠారెడ్డి, పాఠశాల సిబ్బంది రవికుమార్, నవీన్, రాజశేఖర్‌నాయుడు, మల్లికార్జున, రాజు, రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల సొమ్ము రుణాలకు జమ బాధాకరం

వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, సహాయ కార్యదర్శి భాస్కర్



ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, పేదలు

ప్రజాశక్తి-శింగనమల

ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల పేరుతో పేదల ఖాతాల్లో వేస్తున్న నగదును బ్యాంకు అధికారులుపాతబాకీలకు జమ చేసుకోవడం బాధాకరమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ అన్నారు. సోమవారం ఎపి వ్యవసా య కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండలంలోని సలకంచెరువు ఎస్‌బిఐ ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల తల్లివందనం, ఉపాధి హామీ డబ్బులు, మరుగుదొడ్ల బిల్లును పేదల ఖాతాల్లోకి జమ చేసిందన్నారు. అయితే నగదు పడిన వెంటనే బ్యాంకు అధికారులు జమ చేసుకుంటున్నారన్నారు. సంక్షేమ పథకాల సొమ్మును పాత రుణాలకు జమ చేసుకోకూడదని ప్రభుత్వం చెబుతోందన్నారు. అయితే ఇందుకు విరుద్ధంగా సలకంచెరువు బ్యాంకు అధికారులు మాత్రం పేదలకు అందాల్సిన సొమ్మును అందకుండా చేస్తున్నారన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి సలకంచెరువు బ్యాంకు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా బ్యాంకు వద్ద వంటావార్పు చేస్తుండగా విషయం తెలుసుకున్న ఎస్ఐ విజయ్‌కుమార్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులతో ఫోన్‌లో మాట్లాడి స్టేషన్‌కు వస్తే మాట్లాడాలని చెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం శింగనమల పోలీస్‌స్టేషన్‌కు బ్యాంకు మేనేజర్ బాలచంద్రుడు, ఫీల్డ్ ఆఫీసర్ భాస్కర్‌ను పిలిపించి చర్చించారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం కార్యదర్శి అధ్యక్షులు సుంకన్న, రామాంజనేయులు, లక్ష్మీనారాయణరెడ్డి, కుళ్లాయప్ప, లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, సూర్యప్రకాష్, చిన్నమట్లగొంది శ్రీనివాసులు, రామకృష్ణ, కుళ్లాయప్ప, చిన్నకాకోనప్ప, రామ్మోహన, రాములమ్మ, నరసక్క, రామాంజనేయులు, లత, భాగ్య, సరస్వతి, నల్లమ్మ, ఆదినారాయణ, భూపాల్, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికులతో మునుపటి పనులే చేయించాలి

సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున



నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పురపాలక సంఘంలో పని చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు పాత పద్ధతిలోనే యథావిధిగా పనులు అప్పగించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. ఇటీవల కమిషనర్ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల్లో మార్పులు చేస్తూ మున్సిపల్ కమిషనర్ తీసుకున్న నిర్ణయంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. గత 20ఏళ్ల నుంచి నుంచి కార్మికులు ఏ స్థానంలో పనులు చేస్తున్నారో అదేస్థానంలోనే ఉండి ఇప్పటి వరకూ పనులు చేశారన్నారు. అయితే ప్రస్తుత కమిషనర్ మాత్రం కావాలనే కార్మికులను ఇబ్బందులకు గురి చేసేలా నిర్ణయం తీసుకోవడం సరైంది కాదన్నారు. ఇటీవల జరిగిన సమ్మెలో ఇంజినీరింగ్ కార్మికులు కమిషనర్ చెప్పిన మాటకు కట్టబడి పని చేయలేదనే కారణంతోనే ఇలాంటి నిర్ణయం తీసుకున్నారన్నారు. ఇప్పటికైనా కమిషనర్ తన నిర్ణయాన్ని మార్చుకుని కార్మికులకు పాత పద్ధతిలోనే పనులు కల్పించాలని, లేనిపక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో పోరాటాలను కొనసాగిస్తామని హెచ్చరించారు. వీరికి అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు తిప్పేరుద్ర, కార్మికులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తాం

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-పుట్లూరు

నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు వరకూ సాగునీరు అందిచేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. శుక్రవారం యల్లనూరు మండల పరిధిలోని బొప్పేపల్లి, పుట్లూరు మండలంలోని కుమ్మనమల, మడ్డిపల్లి, సంజీవపురం, సుబ్బరాయసాగర్ డ్యాం, చెరువులు, కాలువలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చివరి ఆయకట్టు అయిన యల్లనూరు మండలం బొప్పేపల్లి చెరువుకు నీరు రావాలన్నది ప్రజల చిరకాల కోరిక అన్నారు. ఆ కోరిక తీర్చనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే రూ.3.58 కోట్లతో సుబ్బరాయసాగర్ డ్యాం నుంచి 29వ డిస్ట్రిబ్యూటరీ కాలువ, జాజికొండ వాగు, బొప్పేపల్లి వరకూ మరమ్మతులకు ఆమోదం తెలిపినట్లు వివరించారు. అంచనా వేసి ప్రతిపాదనలు కూడా పంపామన్నారు. గత ఐదేళ్ల కాలంలో వైసిపి ప్రభుత్వం కనీసం చిన్న మరమ్మతులు, గేట్లకు గ్రీజు, కంపచెట్లు తొలగించిన పాపాన పోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతేడాది దాదాపు 150 రోజుల పాటు నీటిని అందించడమే కాకుండా 20 రోజులు ముందుగానే నీరు తెచ్చిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. 95వ కిలోమీటర్ వద్ద పెద్ద లోయలో బండరాయి కాలువలో పడినప్పటికీ యుద్ధ ప్రాతిపదికన తొలగించి పుట్లూరు మండలానికి నీరు అందించామన్నారు. చింతకుంట వద్ద అర్ధరాత్రి కాలువకు గండిపడి తెగిపోతే ఆ సమయంలోనే మరమ్మతులు చేశామని గుర్తు చేశారు. సెప్టెంబర్, అక్టోబర్ నెలలో నీరు వచ్చే అవకాశం ఉందని, రైతులకు సాగునీటితోపాటు తాగునీరు అందించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు పార్థసారథి, సుధాకర్, ఎంఐఎస్ఇ విశ్వనాథ్‌రెడ్డి, డిఇ సత్యనారాయణ, జెఇ శ్రీనివాసులు, టిడిపి మండల కన్వీనర్ బాల రంగయ్య, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గరికపాటి సుదర్శన్‌నాయుడు, జీసీ రామానాయుడు, ఎల్కే చెన్నారెడ్డి, శ్రీనివాసులునాయుడు, కులశేఖర్‌రెడ్డి, జయుడు, చిన్నమల్లేపల్లి చంద్ర, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, మండల నాయకుడు నవీన్ యాదవ్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం గుత్తిలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో ఆర్ఎస్ఎస్ వాదులను ప్రొఫెసర్లగా నియమిస్తున్నారని అన్నారు. విద్యారంగ హక్కులను ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. రాష్ట్రంలో పాలన ఏడాది గడిచిన విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్, ఉపకార వేతనాలు రూ.6400 పెండింగ్లో ఉన్నాయన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న పీడీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. వచ్చేనెల 4, 5వ తేదీల్లో శింగనమలలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు జరుగుతాయన్నారు. సమావేశాల్లో ఎస్ఎఫ్ఐ భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారని చెప్పారు. సమావేశాలకు విద్యార్థులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చరణ్, లోకేష్, జగన్, ఖలందర్, రాకేష్, థామస్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలి

ఉరవకొండ : అధికారులు చిత్తశుద్ధితో పని చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి సూచించారు. శుక్రవారం విడపనకల్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షత ఎంపిడిఒ షకీలా బేగం ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మండలంలో ఉన్న పలుగ్రామాల సమస్యలు పరిష్కారానికి అధికారులంతా చిత్తశుద్ధితో ప్రజాప్రతినిధుల సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. అలా కాకుండా ప్రజాప్రతినిధులను విస్మరిస్తుండడంతోపాటు సర్వసభ్య సమావేశాలకు ఎందుకు హాజరుకావాలని ప్రజాప్రతినిధులు ప్రశ్నిస్తున్నారన్నారు. ఇలాంటి సమస్యలు పునరావతం కాకుండా అధికారులు జాగ్రత్తలు పాటించాలన్నారు. సభకు హాజరుకాని మండల స్థాయి అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో జడ్పిటిసి హనుమంతు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ భాస్కర్, ఇఒఆర్‌డి సత్యబాబు, పంచాయతీ సెక్రటరీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అబ్దుల్‌కలామ్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

యాడికి : మండల కేంద్రంలోని బుగ్గ రోడ్డులో ఉన్న మోడల్ ప్రైమరీ స్కూల్–4 పాఠశాల ఆవరణలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలామ్ విగ్రహం ఏర్పాటుకు శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు, సామాజికవేత్త, జూటూరు అబ్దుల్‌రజాక్, తదితరులు పాల్గొన్నారు.

చర్చి స్కూల్‌లో గ్రాండ్‌పేరెంట్స్ డే

ప్రజాశక్తి - అనంతపురం

స్థానిక రామ చంద్రనగర్‌లోని సెయింట్ అగస్టిన్ పాఠశాల (చర్చిసూల్") లో శుక్రవారం 'గ్రాండ్ పేరెంట్స్' డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ మేర్ మాట్లాడుతూ పెద్దవారితో ఎలా మెలగాలో వివరించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిస్టర్ సుజాత మాట్లాడుతూ విద్యార్థులు అవలంభించాల్సిన పద్దతులను వవరించారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యగీతాలు అలరించాయి.

నాయకత్వ లక్షణాలపై అవగాహన

శింగనమల : విద్యార్థి దశ నుంచే విద్యార్థులకు నాయకత్వ లక్షణాలపై అవగాహన కల్పిస్తున్నట్లు హైదరాబాద్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ జిఎం రామసుబ్బారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా పాఠశాలలో ఎలక్షన్ డే నిర్వహించారు. ఇందులో భాగంగా నాయకులు ఎలా ఉండాలి.. ఎన్నికలు అంటే ఎమిటి.. ఓటుహక్కు ఎలా వినియోగించుకోవాలనే అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధికి పునాది వేయడానికి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిఇఒ ప్రతాపరెడ్డి, ఎజిఎం శంకరనారాయణ, ప్రిన్సిపాల్ ఈశ్వర్ పాల్గొన్నారు.

చంద్రబాబును నమ్మితే మోసమే.. : వైసిపి

ప్రజాశక్తి -యాడికి

చంద్రబాబును ఎప్పుడు నమ్మినా మోసం చేయడం ఆయనకు అలవాటు అని వైసిపి నాయకులు విమర్శించారు. శుక్రవారం మండల పరిధిలోని రాయలచెరువు గ్రామంలో 'బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైసిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టో వివరాలు, ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు బాల రమేష్‌బాబు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వెంకటరామిరెడ్డి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి తలారి నాగేష్, సీనియర్ నాయకులు బ్రహ్మానందరెడ్డి, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు పెద్దపేట లక్ష్మీదేవమ్మ, సుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, కొండారెడ్డి, రవిశంకర్‌రెడ్డి, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

పామిడి : సాగులో మెళకువలు పాటిస్తే డబ్బు, సమయం, శ్రమ ఆదా చేసుకోవచ్చని జిల్లా వనరుల కేంద్రం ఎఒ రుమానాబేగం తెలిపారు. మండలంలోని వంకరాజు కాలువ, నెమల్లపల్లి గ్రామాల్లో ఎఒ విజయ్‌కుమార్‌తో కలిసి రైతులకు శుక్రవారం భూసార ఫలితాల పత్రాలను అందించారు. ఈ సందర్భంగా రుమానాబేగం మాట్లాడుతూ రైతులందరూ వ్యవసాయ శాఖ ద్వారా మెరుగైన వ్యవసాయ పద్ధతులు తెలుసుకుని పాటించి అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ముఖ్యంగా పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణ చర్యలు గురించి వివరించారు. వివిధ పైర్లకు ఏఏ ఎరువులు ఎంతెంత మోతాదులో వేసుకోవాలి, విత్తన ఎంపికలో మెళకువలను తెలిపారు. నెలాఖరులోపు పంటల బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒలు పాల్గొన్నారు.

వైసిపి నాయకునికి పరామర్శ

పెద్దపప్పూరు : అనారోగ్యానికి గురై బెంగళూరులో చికిత్స చేయించుకుని ఇటీవల స్వగృహానికి వచ్చిన వైసిపి మండల అధ్యక్షులు రామిరెడ్డిని మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఇందులో భాగంగా ఆయన ఆరోగ్యంపై ఆరాతీశారు. జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

నార్పల : మండల పరిధిలోని గూగూడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజనాన్ని డిప్యూటీ ఎంపిడిఒ శైలజారాణి పరిశీలించారు. ఇందులో భాగంగా విద్యార్థులతో కలిసి భోజనం తిన్నారు. అనంతరం ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మదన్మోహన్‌రెడ్డి, పీడీ శ్రీదేవి, కార్యదర్శి కీర్తన, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం తనిఖీ

యల్లనూరు : కేంద్రంలోని మద్యం దుకానాన్ని ఎక్సైజ్ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. దుకాణంలో ఎంఆర్‌పి ధర కంటే రూ.10 అధికంగా వసూలు చేస్తున్నారని పలువురు మందుబాబులు ఎక్సైజ్ అధికారులు చరవాణి ద్వారా గురువారం ఫిర్యాదు చేశారు. అంతేగాకుండా ఓ అజ్ఞాత వ్యక్తి మద్యం దుకాణంలో జరుగుతున్న దోపిడీపై సిఎం చంద్రబాబుదోపాటు మంత్రి నారా లోకేష్‌కు ట్విటర్ వేదికగా ఫిర్యాదు చేశాడు. ఇందుకు స్పందించిన ఎక్సైజ్ అధికారులు మద్యం దుకాణంలో విస్తృతంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సే ల్స్ మేనేజర్ తోపాటు గుమాస్తానను అధిక వసూళ్లపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంకోసారి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'జాయింట్' సమస్యల పరిష్కారానికి గడువు పొడిగింపు

డి.హరేహాల్ : రీ సర్వే సందర్భంగా వచ్చిన జాయింట్ ఎల్పి నెంబర్ల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం గడువు పొడిగించినట్లు తహశీల్దార్ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 31వ తేదీ వరకూ జాయింట్ ఎల్పి నెంబర్లు ఉన్నవారు దరఖాస్తు చేసుకుని పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

పుట్లూరు : రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ రుణాలకు అర్హులైన మైనారిటీలు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ అలివేలమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం మండలానికి నాలుగు యూనిట్లు మంజూరయ్యాయన్నారు. కావున అర్హులైన వారు ఆన్‌లై ద్వారాగానీ, సచివాలయాల్లోగానీ దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

దళితులకు రక్షణ కల్పించాలి

బుక్కరాయసముద్రం : తెలుగు తమ్ముళ్లు మొదట దళితులకు రక్షణ కల్పించిన తర్వాత విమర్శలు చేయాలని వైసిపి ఎస్సీ సెల్ విభాగం నాయకులు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మీవైపు తప్పులేనప్పుడు జిల్లా పర్యటనకు వచ్చిన హోంమంత్రిని ఎందుకు కలవనీయకుండా గృహనిర్బంధం చేశారని ప్రశ్నించారు. మీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలు, బాలికలపై ఎన్ని అత్యాచారాలు జరిగాయో ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచించారు. ముందు కూటమి నాయకులు విమర్శలు చేయడం మాని దళితులు, మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసిపి ఎస్సీ సెల్ కన్వీనర్ మంత్రి ఆంజనేయులు, నాయకులు సాకే రామాంజనేయులు, సాకే ఆంజనేయులు, రఘు, కాటమయ్య, నార్పల అంజి, రఘు, నిమ్మల భాస్కర్, బండి భాస్కర్, క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

రాయదుర్గం : నియోజకవర్గ పరిధిలోని 26 మందికి సిఎం సహాయనిధి మంజూరైన రూ.17 లక్షల చెక్కులను విప్ కాలవ శ్రీనివాసులు శుక్రవారం తన నివాసంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఇప్పటి వరకునియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.1.20 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు.

అదృశ్యమైన విద్యార్థుల ఆచూకీ లభ్యం

అనంతపురం క్రైం : అదృశ్యమైన నలుగురు విద్యార్థుల ఆచూకీని త్రీటౌన్ పోలీసులు కనుగొన్నారు. త్రీటౌన్ సీఐ శాంతిలాల్ తెలిపిన వివరాల మేరకు.. కూడేరు, నార్పల, గార్లదిన్నె, గోరంట్ల మండలాలకు చెందిన నలుగురు విద్యార్థులు నగరంలోని 1వ రోడ్డులోని పొట్టి శ్రీరాములు పాఠశాలలో 8, 9, 10 తరగతులు చదువుతూ మూడవ రోడ్డులోని బిసి హాస్టల్‌లో ఉంటున్నారు. బాగా చదువుకోవాలని లేదంటే చర్యలు తీసుకుంటామని స్కూలు టీచర్లు సూచించడంతో నలుగురు ఏకమై గురువారం సాయంత్రం చెప్పకుండా స్కూలు నుంచి వెళ్లిపోయారు. నలుగురు మిస్సింగ్‌పై స్థానిక మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి రంగంలోకి రెండు ప్రత్యేక బృందాలను దింపినట్లు తెలిపారు. ఇందులో భాగంగా బెంగుళూరు, తిరుపతి నగరాల్లో గాలింపు చేపట్టారు. టెక్నాలజీ సహాయంతో తిరుమలలో ఉన్నట్లు గుర్తించి అక్కడి పోలీసుల సహకారంతో సదరు నలుగురు విద్యార్థులను మూడవ పట్టణ పోలీసులు సురక్షితంగా హ్యాండోవర్ చేసుకుని అనంతపురం తీసుకొస్తున్నారు.

సెలవులో డిఇఒ

అనంతపురం సిటీ : డిఇఒ ప్రసాద్‌బాబు మూడు రోజులపాటు సెలవుపై వెళ్లినట్లు సమాచారం. ఆయన భార్యకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో గురువారం రాత్రి హుటాహుటిన కడపకు వెళ్లి అక్కడ నుంచి అంబులెన్సులో హైదరాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నట్లు తెలిసింది. ఆమె ఆరోగ్యం కుదుటపడితే సోమవారం విధులకు హాజరయ్యే అవకాశం ఉంది. ఆరోగ్య పరిస్థితిని బట్టి మరికొన్ని రోజులు సెలవును పొడిగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అప్పటి వరకు ఇన్‌ఛార్జి డిఇఒగా అనంతపురం డివైఇఒ శ్రీనివాసరావు కొనసాగనన్నారు.

'జీడిపల్లి' పరివాహక ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

బెలుగుప్ప : మాల్యాల నుంచి రాగులపాడు పంప్‌హౌస్ ద్వారా మండల పరిధిలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు కృష్ణాజలాలు వస్తుండటంతో పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ అనిల్‌కుమార్ శుక్రవారం సూచించారు. రిజర్వాయర్‌కు నీరు వస్తుండటంతో గేట్ల వద్దగానీ, రిజర్వాయర్ వద్దకుగానీ ఎవరూ వెళ్లకూడదన్నారు. ముఖ్యంగా ఈత కొట్టుందుకు, చేపలు పట్టేందుకు రాకూడదన్నారు. జీడిపల్లి, రామసాగరంలో నివాసం ఉండేవారు ఇళ్ల వద్దకు నీరు వచ్చినా.. ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగినా వెంటనే గ్రామ రెవెన్యూ అధికారికిగానీ, తనకుగానీ సమాచారం అందించాలన్నారు.

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్ బోల్తా.. 8 మంది కూలీలకు గాయాలు

బొమ్మనహాల్ : మండల పరిధిలోని గోవిందవాడ–తారకాపురం మధ్యలో వేరుశనగ నూర్పిడి చేసే ట్రాక్టర్ శుక్రవారం బోల్తా పడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న 8మంది కూలీలు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని గోవిందవాడ గ్రామానికి చెందిన కూలీలు రోజులాగే వేరుశనగ మిషన్‌కు వెళ్లారు. కూలీలతో వచ్చిన ట్రాక్టర్ తారకాపురం సమీపంలోకి రాగానే ట్రాక్టర్ కొండి ఊడిపోయి బోల్తా పడింది. దీంతో 8 మంది కూలీలు గాయపడ్డారు. వెంటనే వారిని ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.